క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

మద్దూరు: మండలంలోని రోడ్డు విస్తరణ పనులను శనివారం ఆర్అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. ప్రస్తుతం రూ. 5.25 కోట్ల ఆర్అండ్‌బీ నిధులతో తుకిమెట్ల నుంచి నారాయణపేట రోడ్డులోని 43.6 కిలో మీటర్ నుంచి 46.2 కిలోమీటర్ వరకు 35 ఫీట్ల డివైడర్‌తో కూడిన రోడ్డు, డ్రెయినేజీ ఏర్పాటు చేయనున్నట్లు ఆర్అండ్‌బి డిప్యూటీ రాములు తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 20న పనులు ప్రారంభించి అలాగే వదిలేశారు. దీంతో అప్పటి నుంచి ఈ పనులు అలాగే నిలిచిపోయాయి. దీంతో ఉదయం పనులు ప్రారంభిచడానికి అధికారులు వస్తే దుకాణాల యజమానులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. నెలరోజుల్లో పనులు పూర్తిచేస్తామని, ఈ పనులకు అందరు సహకరించాలని శాంతించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నారాయణపేట: జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి 2గంట వరకు ఉప విద్యుత్ కేంద్రంలో 11 కేవీ ఫీడర్ మరమ్మతు వలన విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ మహమ్మద్ రఫీ తెలిపారు. సివిల్ -1 ఫీడర్ పరిధిలో బస్సుడిపో సాయివిజయ్ కాలనీ, సింగార్ బేస్‌కాలనీ, సరాఫ్ బజార్, దర్గా ఏరియా, కుమ్మరివాడి, దామరగిద్దరోడ్, యాదగిరి ఫీడర్ కింద శాతవాహన కాలనీ ఏరియా, గురుకుల స్కూల్ సత్యనారాయణ టెంపుల్ ఏరియాలు వస్తాయని తెలిపారు. వినియోగదారులు, వ్యాపారస్తులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

నేడు బీజేపీ సభ్యత్వ నమోదు

నారాయణపేట రూరల్: భారతీయ జనతా పార్టీ జిల్లా సభ్యత్వనమోదు కార్యక్రమం ఆదివారం ప్రారంభిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని శాసన్‌పల్లి రోడ్ లక్ష్మీ బాంకెట్ హాల్‌లో మధ్యాహ్నం 3గంటలకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ల చేతుల మీదుగా నిర్వహిస్తామని తెలిపారు.

27న శ్రీకృష్ణాష్టమి వేడుకలు

నారాయణపేట రూరల్ : కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు నర్సింహులు, కార్యదర్శి కడుదాస్ ప్రవీణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.ఈ నెల 26నరాత్రి స్వామివారి డోలారోహణం, 27న సాయంత్రం స్వామి వారి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

బహుమతుల అందజేత

మద్దూరు: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం కబడ్డీ, ఖోఖో క్రీడా పోటీలను ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. ఈ క్రీడలను పీడీలు వెంకటప్ప, కతలప్ప, బసంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో కొనసాగాయి. ఈ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింహులు, హెచ్ఎం కృష్ణామూర్తి బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

ఐఎన్‌టీయూసీలో 'పేట' వాసికి చోటు

నారాయణపేట రూరల్: ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపిక చేసిన సభ్యుల జాబితాలో నారాయణపేట వాసికి చోటు దక్కింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పది ఆర్టీసీ డిపోల నుంచి ఏడుగురికి అవకాశం దక్కగా వారిలో అహ్మద్‌ఖాన్ ఉన్నారు. ఈయన కోయిలకొండ మండలానికి చెందిన వ్యక్తి కాగా పేట ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఆయనకు స్టేట్ డిప్యూటీ సెక్రెటరీగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఇచ్చిన పనిని అంకిత భావంతో నిర్వహించి, కార్మిక సమస్యల సాధనకు కృషి చేస్తానని చెప్పారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మరికల్: చిన్నచింతకుంట మండలం నుంచి పళ్లమర్రి నుంచి పెద్దచింతకుంటకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు శనివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా పళ్లమర్రి సమీపంలో ఉన్న ఊకచెట్టు వాగునుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను పెద్దచింతకుంటకు తరలిస్తుండగా ఏఎస్ఐ ఎల్లయ్య సిబ్బందితో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యాజమానులపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం కేసునమోదు

మాగనూర్: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (16) అదృశ్యమైందని ఎస్ఐ పి. అశోక్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక శుక్రవారం రాత్రి ఇంట్లో వెళ్లి వస్తానని చెప్పివెళ్లగా ఎంతకు తిరిగి రాలేదని కుటుంబసభ్యులు కొంతసేపటి తర్వాత చుట్టుపక్కల వెతకగా ఎంతకు కన్పించకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికిన ఆచూకి లభించలేదు. దీంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుమేరకు శనివారం కిడ్నాప్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పత్తికి.. ముప్పే

- భారీ గాలులతో పాటు వర్షం
- పంటలకు వాటిల్లుతున్న నష్టం
- ఆందోళనలో రైతులు


మరికల్‌లో అధిక వర్షానికి పత్తి గూడ రాలిన పంటను చూపిస్తున్న రైతు

మరికల్: ఒక పక్క కూలీల కొరత మరోపక్క ఎరువుల భారంతో సతమతవుతున్న తరుణంలో వరుసగా కురుస్తున్న భారీ గాలుల వర్షాల మధ్య రైతన్నలు నలిగి పోతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో కాపు దశకు వచ్చిన పత్తి పంటలు తెగుళ్ల భారిన పడుతున్నాయి. దీంతో రైతులు పిచికారి మందులు కొట్టడమే కాకుండా పొలాల్లో కలుపు తీయడం కోసం ఒక్కొక్కరికీ రూ. 500చొప్పున చెల్లించడంతో అధిక పెట్టుబడుల భారం పడింది. మండలంలో ఈ ఏడాది రైతులు ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు పెట్టుబడులు పెట్టలేక నానా అవస్థలు పడుతున్నారు. పెరిగిన కూలీల ధరల నుంచి ఎరువుల వరకు ఇలా ప్రతిది పెరగడంతో వ్యవసాయం కష్టకాలంగా మారింది.

మండలంలో అధికంగా పత్తి సాగు..

మండలంలోని 20 ఏళ్ల నుంచి కూడా ఇక్కడ అధిక శాతం రైతులు పత్తి పంటపై ఆధారపడుతున్నారు. గతేడాది వర్షాలు లేక పత్తిలో తీవ్రంగా నష్టపోయిన రైతులు మరోసారి తమ అదృష్టాన్ని పరిక్షించుకునేందుకు ఈ ఏడాది మండల వ్యాప్తంగా 16వేల ఎకరాలకు పైగా పత్తిసాగు చేశారు. ఇప్పటివరకు పంటకు తగ్గటుగా వర్షాలు కురుస్తున్నాయి. కానీ ప్రస్తుత సమయంలో వరుసగా వర్షాలు రావడంతో పంట దెబ్బతినడానికి కారణమవుతుంది. పెరిగిన పెట్టుడులతో ఎకరాకు రూ. 35వేల ఖర్చు అవుతుంది. పత్తి చేతికొచ్చేవరకు నమ్మకం లేదు.

భారీ గాలులతో వర్షాలు..

గత పదిరోజుల నుంచి భారీగాలులతో కూడిన వర్షాలు కుర్వడంతో రైతులు సాగుచేసిన పత్తి పంటలు నేలకు ఒరగడమే కాకుండా పత్తిగూడ రాలుతుంది. చెట్టుకు 30నుంచి 80వరకు పూతగూడ, కాయలు ఉన్నాయి. ఇలా వరుసగా వర్షాలు కురిస్తే తేమశాతం అధికమై పంటదెబ్బ తినే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆగకుండా వర్షాలు రావడంతో నేలకొరిగిన పత్తి చెట్టుకు వచ్చిన కాయలు మురిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్షాలతో పంటకు నష్టం..



వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తి పంటకు నష్టం వాటిల్లితుంది. పంట కిందపడటంతో చెట్లను నిలబెట్టిందుకు అదనంగా కూలీల ఖర్చు అవుతుంది. ముసురు వర్షాలతో పొలంలో కలుపు రావడమే కాకుండా తెగుళ్లు కూడా అధికంగా వస్తున్నాయి. ఎకరా పంటకు రూ. 35వేలకు పైగా పెట్టుబడి అవుతుంది. - తిరుపతయ్య, రైతు, మరికల్

ఆరు ఎకరాల్లో పత్తి సాగుచేశాను..



వస్తుంది. ఆరు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. వారం రోజుల నుంచి కురుస్తున్న ఈ వర్షాలతో తేమశాతంతో పత్తిగూడ రాలిపోతుంది. ఇప్పటికే సగం కాపు నష్టం వచ్చింది. పండిన పంటకైనా మార్కెట్‌లో కనీస మద్ధతు ధర లభిస్తే రైతులకు మేలు జరుగుతుంది. లేదంటే కష్టాలు తప్పవు. - వెంకటేష్, రైతు, జిన్నారం

అధికారుల సలహాలు పాటించాలి..

ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి పంట విషయంలో వ్యవసాధికారుల సలహాలు తీసుకోవాలి. ఇలా వర్షాలు అధికంగా వచ్చినప్పుడు తప్పకుండా పంటకు తెగుళ్ల వస్తాయి. పెట్టుబడులను కొద్దివరకైన తగ్గించుకునేందుకు అధికారులను సంప్రందించి పిచికారి మందులను వాడితే ప్రయోజనం ఉంటుంది. - పరుశురాం, ఏఈఓ, మరికల్

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటుకున్న ఎస్ఐ

నారాయణపేట రూరల్: విద్యార్థి దశలోనే చదువుతోపాటు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడామాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని పాఠశాల, కళాశాల స్థాయిలో వేర్వేరుగా క్రికెట్ పోటీలను నిర్వహించారు. శనివారం స్థానిక ఎస్ఐ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఆటలతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, యువత ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సింహులు, జీహెచ్ఎం వేణుగోపాల్, న్యాయనిర్ణేతలు, గణేష్, ధర్మేంద్ర, పీఈటీలు శ్రీధర్, అక్తర్‌పాషా, పర్వీన్‌బేగం, నవీన్, తులసి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



మాగనూర్: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అశోక్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నల్లగట్టు మారెమ్మవ్వ ఆలయ సమీపంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదుచేసి జైలుకు పంపితామన్నారు. విధిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపొద్దని హెచ్చరించారు. అలాగే కార్ అద్దాలకు బ్లాక్‌ఫిలిం ఉపయోగించొద్దని, ఎవరైనా కార్ అద్దాలకు బ్లాక్‌ఫిలిం ఉపయోగిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి..


సభ్యత్వనమోదులో పాల్గొన్న నాయకులు

మాగనూర్: పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు తిరుపతి అన్నారు. శనివారం మండలంలోని ఆయా పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. త్వరలోనే ఏకీకృత సర్వీస్ రూల్స్‌తోపాటు 317 జీఓ సమస్య పరిష్కరించబడుతుందని సీఎం అధికారులను సర్వీస్ రూల్స్‌కు సంబంధించిన సిద్ధం చేయాలని ఆదేశించారని తెలిపారు. అదేవిధంగా గురుకుల సొసైటీ, ఉపాధ్యాయులకు పదోన్నతులు, కేజీబీవీ ఉపాధ్యాయుల బదిలీలు ఇప్పించిన ఘనత పీఆర్టీయూఎస్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బలరాం, ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, శ్రీనివాసులు, గురురాజారావు, రాజేశ్వరి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

జాతర ఉత్సవాలకు ముస్తాబు



ధన్వాడ: మండలంలోని మందిపల్లిపాతతాండలో శ్రీకృష్ణ దేవుని జాతర ఉత్సవాలకోసం గ్రామస్తులు ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు. రెండు రోజులు నిర్వహించే ఈ ఉత్సవాలలో మొదటి రోజు 26న ఉదయం జల్దిబిందె, స్వామివారికి అభిషేకం చేస్తారు. సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక భజన కార్యక్రమలు, 27న బోగ్ నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం జాతర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ ఉత్సవాలలో మండల వాసులతో పాటు గ్రామసులు పాల్గొనున్నట్లు తెలిపారు.

కరపత్రం ఆవిష్కరణ

మక్తల్: పట్టణంలో వీరశైవలింగయాత్ ఆధ్వర్యంలో ఈ నెల 30న బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా శనివారం స్థానిక మల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలో పిఠాధిపతి శ్రీ పంచమ సిద్ధలింగేశ్వర చేతులమీదుగా కరపత్రాలు ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో దూది బస్వరాజ్, తిప్పయ్యస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్ కుమార్, గౌరవ సభ్యులు వీరేశం, శివరాజ్, జగదీష్, దేవేంద్రప్ప, సోమశేఖర్, సుధాకర్, అంబ్రేష్ రాజశేఖర్, రాకేష్, సురేస్, సిద్ధు పాల్గొన్నారు.


కరపప్రతాలను ఆవిష్కరిస్తున్న పిఠాధిపతి శ్రీ పంచమ సిద్ధిలింగేశ్వరస్వామి

అంగన్‌వాడీలో రక్షాబంధన్



నారాయణపేట రూరల్: మండంలలోని బైరంకొండ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఆలస్యంగా రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ సావిత్రి ఆధ్వర్యంలో శనివారం చిన్నారులు ఒకరికొకరు రాఖీలను కట్టుకుని మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ మేరకు.. రాఖీ పండగ విశిష్ఠతతో పాటు సోదరసోదరీమణుల మధ్య ఉండే బందాలను తెలియజేశారు.

ఇసుక డంపుల స్వాధీనం

మక్తల్: మండలంలోని దాసర్‌దొడ్డిలో పది టిప్పర్ల ఇసుక డంప్‌ను శనివారం సాయంత్రం టాస్క్‌పోర్స్ దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు ఆర్ఐ విజయ్ అక్కడికి వెళ్లి పంచనామ నిర్వహించారు. ఇసుక డంపును గ్రామానికి చెందిన వెంకటప్ప, నర్సింహులు ఇసుకను డంపు చేశారని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ-2 ఆచారి తెలిపారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు


నారాయణపేటలో పోటాపోటీగా ఉట్టి కొడుతున్న చిన్నారులు

నారాయణపేట రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య సభ్యులు, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈమేరకు.. చిన్నారులతో గోపికల వేషధారణలో అలరించారు. పాఠశాల ఆవరణలో చిన్నారులతో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా మండలంలో మాద్వార్, లింగంపల్లి, జక్లేర్, పంచలింగాల గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు.

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు చిన్ని కృష్ణులు, ముద్దులొలికే గోపికమ్మల వేషధారణలో వచ్చి అలరించారు. అనంతరం ఉట్టిని కొట్టి సంబరాలు చేసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

మరికల్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు శ్రీ కృష్ణాష్టమి ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ మేరకు.. విద్యార్థులు కృష్ణుడి, గోపికల వేషధారణాలతో ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులచే ఉపాధ్యాయులు ఉట్టిని కొట్టించారు.

నర్వ: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. శ్రీకృష్ణుడి చిత్రపటానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ హన్మంతురెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీజేష్, ఉపాధ్యాయులు రాజు, గిట్టయ్య, శ్రీధర్, చంద్రశేఖర్‌గౌడ్, రేణుక, సౌభాగ్య, శశికళ పాల్గొన్నారు.


మరికల్‌లో..


ధన్వాడలో..


మక్తల్‌లో..

సమయపాలన పాటించాలి..


రికార్డులను తనిఖీ చేస్తున్న క్లస్టర్ జీహెచ్ఎం

నర్వ: పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సమయపాలన తప్పకుండా పాటించాలని పెద్దకడ్మూర్ కాంప్లెక్స్ జీహెచ్ఎం భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం కల్వాల్ ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ మేరకు.. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు చదవడం, రాయడంతోపాటు చతుర్విద ప్రక్రియల ద్వారా సులభంగా అర్థమయ్యేటట్లు బోధన చేపట్టాలని సూచించారు. హాజరు పట్టికలను పరిశీలించి విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పచ్చదనం వెల్లివిరియాలన్నారు. హెచ్ఎం ప్రన్నకుమారి, సీఆర్పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణమాస పూజలు


పేటలో ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


మరికల్‌లో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రతిష్టాపనోత్సవాలు వైభవంగా కొనసాగాయి. శనివారం ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, మహామంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ, రథోత్సవాన్ని నేత్రపర్వంగా చేపట్టారు. ఈ సందర్భంగా బిద్వాన్ హరీష్ ఆచార్య, ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కౌన్సిలర్ మేఘన, అర్చకులు నరసింహచారి, ప్రహ్లాద్, సేవా సమితి సభ్యులు సీతారామారావు, శేషు ప్రసాద్, ప్రకాష్, శ్రీనివాస్, రామారావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మద్దూరు: శ్రావణమాసంలోని మూడో శనివారాన్ని పురస్కరించుకొని దామ్లతండా, భూనీడ్ ఆంజనేయస్వామి జాతరలు ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. దోరేపల్లిలోని వీరప్ప ఇంటి నుంచి స్వామి వారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. గ్రామస్తులు తాండలోని బావి వద్ద గంగజలం తెచ్చి భక్తులు స్వామివారిని అభిషేకం చేశారు. అనంతరం పూజలుచేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భూనీడ్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాలు నిర్వహించారు. జారత ఉత్సవాలను పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక ఆంజనేయస్వామి, తిరుమలేశుని ఉత్సవాలు వైభంగా కొనసాగాయి. ఉదయం భారీ ఊరేగింపుతో జల్ది ఉత్సవం నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా కళాకారులు నృత్యాలు చేస్తూ సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

మక్తల్: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్టాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు.. శనివారం స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో ఉన్న కల్యాణ మంటపంలో హోమం నిర్వహించారు. స్వామివారి ఆలయం వద్ద బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గుప్తా, మాజీ ఎంపీపీలు చంద్రకాంత్‌గౌడ్, కొండయ్య, మాజీ సర్పంచ్ భాగ్యమ్మ, సూర్యనారాయణగుప్తా, శ్రీరాం, లక్ష్మన్, ఆంజనేయులు, సత్యనారాయణ, అంబాదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని ఆర్యసమాజ్ మందిర్‌లో శ్రావణమాస కార్యక్రమంలో భాగంగా శనివారం గాయిత్రి మహాయజ్ఞాన్ని నిర్వహించారు. వేదపండితులు యజ్ఞబ్రహ్మ పండిత్ ప్రియదత్తు శాస్త్రీజీ గాయిత్రి యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో కనకప్పార్య, గొల్ల రాముడు, గోపాల్‌రెడ్డి, బాల్‌రాజు, జ్ఞానేశ్వర్, కోరి పవన్ పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహాస్వామి వారి జల్దిబిందె మహోత్సవం శనివారం గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. గ్రామం నుంచి స్వామివారిని కృష్ణానదికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా స్వామివారిని ఆలయానికి తీసుకొచ్చారు. మండలంలోని వివిధ గ్రామల నుంచి భక్తులు పెద్ద అధిక సంఖ్యలో తరలివచ్చారు.

వైభవంగా రథోత్సవం

మరికల్: మండలంలోని జిన్నారం సమీపంలో ఆది హన్మన్నకాశీవిశేశ్వర రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా రథోత్సం నిర్వహించి జాతర ఉత్సవాలను ప్రారంభించారు. అలాగే కిష్టంపల్లి, ఎలిగండ్ల గ్రామాల్లో స్వామివారి వేడుకలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


మద్దూర్‌లో స్వామి వారి ఊరేగింపు..


మక్తల్‌లో హోమం నిర్వహిస్తున్న భక్తులు


ఊట్కూరులో పాల్గొన్న భక్తులు

చక్రపాణిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి


కృష్ణాలో తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతి అందిస్తున్న నాయకులు

నారాయణపేట/కృష్ణా: దళితుల పెళ్లిని గుడి బయట జరుపుకోవాలని ఆదేశించి అవమానించిన పూజారి, సీనియర్ అసిస్టెంట్ ప్రభుత్వ ఉద్యోగి చక్రపాణిపై చట్టపరమైన తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపి పలువురు నాయకులు మాట్లాడారు. కృష్ణా మండలంలోని ముడుమాల్‌లో యాదవేంద్ర స్వామి మఠంలో ఈ నెల 18న దళిత కుటుంబానికి చెందిన ఒబులేష్ పెళ్లి జరుపుకునేందుకు గుడిలో అనుమతించకపోవడంతో గుడి బయట మెట్లపై జరుపుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఉద్యోగిని వెంటనే సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కృష్ణాలోని చక్రపాణిపై చట్టపరమైన తీసుకోవా లని అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు సగరం రమేష్, తిమ్మప్ప డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో అంబేడ్కర్ జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు మహేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్ మాదిగ, టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుతారి కృష్ణయ్యతో పాటు దళిత ప్రజాసంఘాల నాయకులు రమేష్, వెంకటేష్, ప్రశాంత్, కిరణ్, నర్సింహులు, నరహరి, మాధవ్, అశోక్, ఆనంద్, వెంకటేష్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు సగరం రమేష్, తిమ్మప్ప, అంబేడ్కర్ సంఘం నాయకులు కృష్ణయ్య, రాఘవేంద్ర, శంకర్, వసంత్ కుమార్, పెద్దింటి లక్ష్మణ్, మహేష్, నరేష్, రాము, పాల్గొన్నారు.

నూతన ఎస్ఐకి సన్మానం..

మాగనూర్: భారతీయ జనతా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌కి నూతనంగా విచ్చేసిన ఎస్ఐ పి. అశోక్ బాబుని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం బాధ్యతలు స్వీకరించినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జయసంద్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.